క్లుప్తంగా

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో కోరారు. స్థానిక మండల భవిత కేంద్రం ప్రతి సోమవారం దివ్యాంగులకు వైద్యుడు వీరేష్‌చే ఫిజియోథెరపీ నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులలోని దివ్యాంగులకు భవిత కేంద్రానికి తీసుకవచ్చి, ఫిజియోథెరపీ చేయించాలని విజ్ఞప్తి చేశారు.

భూమికి పచ్చానిరంగేసినట్లు



కళకళలాడుతున్న వేరుశనగ పంట

కోడుమూరు రూరల్ : మండలంలో బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటలు ప్రస్తుతం పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. మండలంలోని వర్కూరు, పులకుర్తి, కల్లపరి, ప్యాలకుర్తి, లద్దగిరి తదితర గ్రామాల్లో బోరుబావుల కింద రైతులు సుమారు 380కుపైగా ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశారు. ప్రస్తుతం వేరుశనగ పంట బుడ్డ దశకు చేరుకోవడంతో పాటు, పచ్చదనంతో ఆకట్టుకుంటోంది.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కోడుమూరు రూరల్ : ఏపీ రైతు సంఘం జిల్లా పదో మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1936సంవత్సరంలో అఖిల భారత రైతు సంఘం ఏర్పడిందని, నాటి నుంచి నేటి వరకు రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. సోమవారం ఎమ్మిగనూరులో జరిగే మహాసభలకు రైతులు భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి రాజు, కార్మిక సంఘం తాలుకా కార్యదర్శి శేషకుమార్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

స్పందనకు హాజరుకాకపోతే చర్యలు

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శేషఫణి ఆదేశించారు. గైర్హాజరయ్యే అధికారులపై నివేదకలను కలెక్టర్ కార్యాలయానికి పంపించడంతో పాటు ఉన్నతాధికారులకు చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు.

స్పందనకు హాజరు కావాలి

గూడూరు: సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులందరూ హాజరు కావాలని కోరారు.

భోగేశ్వరంలో భక్తుల సందడి



స్వామివారికి దర్శించుకునేందుకు వేచియున్న భక్తులు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులతో కళకళలాడింది. వివిధ ప్రాంతాలను నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయప్రధాన అర్చకులు శ్యాంసుందరశర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, మహామంగళ హారతులు చేపట్టారు. చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు పంచకోనేర్ల పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

క్లాప్ ఆటోలు నిలుపుదల

కర్నూలు (టౌన్): క్లాప్ డ్రైవర్లకు వేతనాలు చెల్లించే వరకు క్లాప్ ఆటోలు నిలుపుదల చేస్తున్నట్లు సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్, ఓల్డ్‌సిటీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక పున్నమి అతిథి గృహం ప్రాంగణంలో క్లాప్ ఆటోలు నిలిపి వేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లకు ఏడాది కాలంగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. రెడ్డి ఏజెన్సీ పెండింగ్ వేతనాలు చెల్లించకపోగా ఒప్పందం ప్రకారం డ్రైవర్లకు రూ. 18,500 వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, వీక్లీ ఆఫ్‌లు అమలు చేయడం లేదన్నారు. వీటిపై స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

నమ్మించి మోసం చేయడంలో బాబు దిట్ట

- ఆయన నిర్వాకంతో 2014-19 మధ్య కాలంలో 30 లక్షల మంది మహిళలు డిఫాల్టర్‌గా మారారు
- బ్యాంక్‌లో ఉన్న బంగారు బయటకు తెస్తామని చెప్పి మోసం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పాణ్యంలో నూతన పొదుపు భవనాలకు శంకుస్థాపన



పొదుపు భవనాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు నాయుడు దిట్ట అని ఎమ్మెల్యే కాటసాని విమర్శించారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో 30 లక్షల మంది పొదుపు మహిళలు బ్యాంక్‌ల దృష్టిలో డిఫాల్టర్లుగా మారారని, బాబు చేసిన మోసాల్లో ఇదొకటన్నారు. ఆదివారం పాణ్యంలోని అయ్యపురెడ్డి కాలనీలో భారతి, విజయభారతి గ్రామైక్య సంఘాల భవనాలకు ఎంపీపీ ఉశేన్‌బీ, ఏపీఎం ప్రసాద్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ 2014లో అధికారం కోసం చంద్రబాబు నాడు పొదుపు మహిళలు తీసుకున్న రుణాలు, బ్యాంక్‌లో పెట్టిన బంగారును విడిపించిస్తామని నమ్మబలికి తీరా అధికారం వచ్చాక రుణమాఫీ, బంగారు ఊసే లేకుండా చేశారన్నారు. ఈ క్రమంలో పొదుపు సంఘాలు తీసుకున్న రుణాలకు వడ్డీ రెట్టింపు కావడంతో వారు చెల్లించలేకపోయారని దీంతో వారంతా బ్యాంక్‌ల దృష్టిలో డిఫాల్టర్లుగా మిగిలిపోయారన్నారు. అయితే చివరకు వారు ఆస్తులమ్ముకొని రుణాలు చెల్లించారని గుర్తు చేశారు.

పావలా వడ్డీ వైఎస్సార్ చలువే..

పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో మొదటిసారిగా పావలా వడ్డీని వైఎస్సార్ ప్రవేశపెట్టారని, దీంతో లక్షలాది మంది అక్కా చెల్లెమ్మలు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేశారన్నారు. నేడు ఆ పరిశ్రమలే భారీ పరిశ్రమలుగా తయారైనట్లు చెప్పారు. ఆయన బాటలో తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ప్రస్తుతం పొదుపు సంఘాల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పొదుపు సంఘాల తీసుకున్న రుణాలనునాలుగు విడతల్లో చెల్లిస్తామని చేప్పిన మాట ప్రకారమే చెల్లిస్తున్నారన్నారు. ఈ పథకం కింద మండలానికి మూడు విడతల్లో రూ. 13కోట్లు మేర లబ్ధి చేకురిందన్నారు. నాలుగవ విడతకు రూ.4కోట్లు విడుదలవుతాయని చెప్పారు.

ముఖద్వారానికి భూమి పూజ..

స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో శ్రీ పాణికేశ్వర ముఖద్వారానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆలయంతో గ్రామానికి పేరుగా ఉన్న శ్రీ పాణికేశ్వరస్వామి ముఖద్వారం (ఆర్చీ)ని ఆధునిక పద్ధతుల్లో నిర్మించాలని నిర్వాహకులకు సూచించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, కో- ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉశేన్, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుమంత్‌రెడ్డి, ఆటోమాబు, బాబు, రమణ, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, జయచంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జిల్లాకే తలమానికం పులకుర్తి హైస్కూల్



పులకుర్తిలో రూ.2కోట్లతో నిర్మించిన హైస్కూల్ భవనం

కోడుమూరు : మండలంలోని పులకుర్తి గ్రామంలో నాడు-నేడు నిధులు రూ.2కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో హైస్కూల్ భవనాన్ని నిర్మించారు. ఇలాంటి హైస్కూల్ భవనాన్ని జిల్లాలో ఎక్కడా లేని విధంగా పులకుర్తి గ్రామంలోనే నిర్మించడం విశేషం. పులకుర్తి హైస్కూలు ప్రస్తుత భవనంలో తగినన్ని తరగతి గదులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నతుండటంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశాలమైన భవనాన్ని నిర్మించడంతో తరగతి గదుల సమస్య తీరింది. రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భవనంలో అందమైన రంగులు, విద్యార్థుల మేధస్సును ప్రతిబింబించేలా బొమ్మలు, బెంచీలు, డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఏర్పాటు చేయడంతో పల్లెటూరులో కార్పొరేట్‌కు మించిన కళ సంతరించుకుంది.

నిర్మాణ పనుల్లో వేగం పెంచండి



మహాప్రాకార పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి పూజలు చేశారు. ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఆలయాభివృద్ధికి ఇటీవల రూ. 2కోట్లతో చేపట్టిన పనుల గురించి ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారంతో దాదాపు రూ. కోటితో పనులు జరుగుతున్నాయని, మరో రూ. 2.07 కోట్లతో ప్రత్యేక గదులు, షెడ్లు, విడిది గదులు, ప్రత్యేక క్యూలైన్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన గగ్గటూరులో రైతులతో మాట్లాడుతూ.. ఎస్సార్బీసీ ఆయకట్టు కింద సాగు చేసిన మిరప రైతులకు సాగు అందిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. రైతుల విజ్ఞప్తి మేరకు త్వరలోనే 15రోజులకొక సారి ఎస్సార్బీసీకి నీటిని విడుదల చేస్తామని చెప్పారు.

పెన్షన్ రివిజన్ అమలు చేయాలి

కర్నూలు (టౌన్) : కోర్టు తీర్పు ప్రకారం విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ రివిజన్ అమలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సహాయ సర్కిల్ కార్యదర్శి రామదాసు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సెంట్రల్ టెలీగ్రాఫ్ కార్యాలయ ప్రాంగణంలో ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జిల్లా ద్వైవార్షిక, పెన్షనర్ డే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆందోళన కార్యక్రమాలు చేపడదామన్నారు. అలాగే 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.



పూదోట కాదు..

కల్లూరు: ఈ చిత్రంలో కనిస్తున్న మొక్కలు, పూలు చూస్తుంటే ఇదేదో పూల తోట అనుకుంటే పొరబడినట్లే. మరేంటనుకుంటున్నారా.. ఇది లక్ష్మీపురం పొలాల్లో సాగు చేసిన పొగాకు పంట. సాధారణంగా రైతులు పొగాకు పంటల్లో మొక్కల పై భాగంలో పెరిగే చెండును తీస్తారు. చెండు తీస్తే ఆకు మందంగా తయారై మంచి దిగుబడి వస్తుంది. నాటు పొగాకులో చెండు తీస్తే ఆకు మందంగా తయారవుతుందని, దీంతో రైతుకు అధిక లాభాలు వస్తాయని, సిగరెట్ పొగాకు అయితే చెండు ఉంచి ఆకు కోస్తారని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయండి



ఎమ్మెల్యే కాటసానిని సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ కమిటీల్లో పదవులు పొందిన వారంతా బాధ్యతాయుతంగా పని చేసి పార్టీ అభివృద్ధికి దోహదపడాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా ఎస్సీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు శివ, ఎస్సీ విభాగం జిల్లా జాయింట్ సెక్రటరీ జి.నాగరాజు, బీసీ సెల్ జిల్లా జాయింట్ సెక్రటరీ గోపినాథ్ ఆదివారం ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు.

చట్టానికి లోబడి ఎరువులు విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు

కర్నూలు(అగ్రికల్చర్): రసాయన ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయంలో ఇన్‌పుట్ డీలర్లు విధిగా వ్యవసాయ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను తూచా పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమ కోర్సుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని రసాయన ఎరువుల నియంత్రణ చట్టం, నిత్యావసర వస్తువుల చట్టం గురించి ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన కల్పించారు. ఎరువుల నియంత్రణ చట్టానికి లోబడే రసాయన ఎరువులను విక్రయించాలని పేర్కొన్నారు. ఎరువుల అమ్మకాల్లో పాటించాల్సిన నియమావళిని అతిక్రమిస్తే తగిన చర్యలు ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌పుట్ డీలర్లు చట్టాలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. విశ్రాంత జేడీఏ, దేశీ శిక్షణ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ... ప్రభుత్వం అనుమతించిన ఎరువులను మాత్రమే విక్రయించాలని సూచించారు. అనుమతి లేని ఎరువులను విక్రయించి అనవసరంగా ఇబ్బందుల్లో పడవద్దని చెప్పారు. కార్యక్రమంలో 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్

కర్నూలు (టౌన్): ఇమ్మానుయేలు చర్చి ఆధ్వర్యంలో స్థానిక కోల్స్ కళాశాల సమావేశ హాలులో ఆదివారం రాత్రి క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన ఇండియన్ ఎవాంజిలికల్ మిషన్ మిషనరీ అన్నెపోగు విక్టోరియా రాణి క్యాండిల్ లైటింగ్ సర్వీసులో పాల్గొని దైవ సందేశం అందించారు. యేసుక్రీస్తు లోకమునకు వెలుగునిచ్చి చీకటి పారద్రోలారన్నారు. చర్చి యువతీయువకులు క్రిస్మస్ గీతాలను ఆలపించి చిరు నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్లు రెవరెండ్ పాల్ అగస్టీన్, రత్నప్రభ, రవికుమార్, చర్చి పెద్దలు ప్రకాష్, ప్రసన్న, సుధాకర్, స్త్రీల సమాజం పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...

క్రీస్తు జననం పవిత్రమైనదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.బాబు రావు అన్నారు. నంద్యాల చెక్‌పోస్టులోని మెగాసిరి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం క్రిస్మస్, క్యాండిల్ లైటింగ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు జరుపుకునే పండుగ క్రిస్మస్ అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జాషువా, డేనియల్, జెట్టి ప్రభుదాస్, జయంత్, బతుకన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లాజరస్, క్రైస్తవ పాస్టర్లు పాల్గొన్నారు.



క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్‌లో దైవసందేశం అందిస్తున్న విక్టోరియా

సనాతన ధర్మం గొప్పది

కర్నూలు సిటీ: సనాతన ధర్మం ఎంతో గొప్పదని, దీని గురించి వేయి పడగలు నవలలో విశ్వనాథ సత్యనారాయణ చాలా చక్కగా వర్ణించారని డా.గంండ్ర లక్ష్మణరావు అన్నారు. ఆదివారం స్థానిక పింగళి సూరన తెలుగు తోటలో సాహితీ సదస్సు నిర్వహించారు. సభాధ్యక్షులుగా శ్రీ కురాడి చంద్ర శేఖర కల్కూర వ్యవహరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు శ్రీవిశ్వనాథ సత్యనారాయణ వేయి పడగల నవల సనాతన ధర్మ అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం జేఎస్‌ఆర్‌కే శర్మ, భరద్వాజ్, మహబూబ్ బాష, విజయమ్మ మాట్లాడారు. సదస్సులో డా.దండేబోయిన పార్వతి దేవి, కావెం సుబ్బలక్ష్మీ, ఎలమర్తి రమణయ్య, ఇనాయతుల్లా, డా.చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

జిల్లా స్థాయి తైక్వాండో పోటీల ప్రారంభం

కర్నూలు (టౌన్) : విద్యార్థి దశలోనే ప్రతి విద్యార్థి, విద్యార్థినీ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక కిడ్స్ వరల్డ్‌లోని రోశయ్య కమ్యూనిటీ హాలులో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. దీని వల్ల చురుగ్గా ఉండి చదువులోనూ రాణిస్తారన్నారు. క్రీడల్లో రాణిస్తే దేశ, విదేశాల్లో పుష్కలంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో తైక్వాండో పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శమంతకమణి, డాక్టర్ శంకర్ శర్మ, డాక్టర్ అమృత సాయి, తైక్వాండో పోటీల నిర్వాహకులు వెంకటేష్ పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న తైక్వాండో క్రీడాకారులు

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

కర్నూలు (టౌన్) : క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉషూ పోటీల విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన ఉషూ క్రీడల్లో రాణిస్తే విద్యా ఉద్యోగాల్లో అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉషూ కార్యదర్శి మాస్టర్ టి. శ్రీనివాసులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసిన ఒలింపిక్ సంఘం నాయకులు శ్రీనివాసులు

ముగిసిన సర్టిఫికేషన్ కార్యక్రమం

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఫార్మాకో విజిలెన్స్ సర్టిఫికెషన్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్, మెయిన్ స్ప్రింగ్ సీఈఓ కె.బసప్ప అతిథిలుగా హాజరై ప్రసంగించారు. ఫార్మాకో విజిలెన్స్ సర్టిఫికెషన్ కార్యక్రమం ద్వారా ఫార్మసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మహేశ్వరరెడ్డి మృతదేహం

ఓర్వకల్లు: నన్నూరు సమీపంలోని ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి(45) కుమారుడు, కుమార్తె చదువు నిమిత్తం నన్నూరు సమీపంలోని రాగమయూరీ గ్రీన్ హిల్స్‌ల్ ఉంటున్నాడు. పొలాలను చూసుకునేందుకు తరచుగా గ్రామానికి వెళ్లివచ్చేవాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పొలం పనులను పరిశీలించిన తర్వాత రాగమయూరికి తన సొంత బైక్‌పై వస్తున్నాడు. మరో ఐదు నిమిషాలలో ఇంటికి చేరుకునే సమయంలో పూడిచెర్ల గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తి నిర్లక్ష్యంగా బైక్ నడుపుతూ మహేశ్వరరెడ్డి బైక్‌ను వెనుకనుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో మహేశ్వరరెడ్డి కింద పడి తలకు తీవ్ర రక్త గాయమైంది. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

వంట తంటాలకు చెక్

- ప్రభుత్వ పాఠశాలలకు కొత్త వంట పాత్రలు
- విద్యార్థుల సంఖ్యను బట్టి గ్రేడ్‌లుగా పాఠశాలల విభజన
- సిల్వర్ పాత్రల స్థానంలో స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రల సరఫరా
- వంట సిబ్బందికి తీరనున్న ఇబ్బందులు



స్టెయిన్‌లెస్ స్టీల్ వంటపాత్రలలో వండిన వంటలను విద్యార్థులకు వడ్డిస్తున్న నిర్వాహకులు



ప్రభుత్వం సరఫరా చేసిన వంట పాత్రలను అందజేస్తున్న ఎంఈవో వసంతలక్ష్మి

కోడుమూరు : ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ పథకం నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మధ్యాహ్న భోజన పథకంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారు. ఇందులో భాగంగానే గోరుముద్దలో పౌష్టికారం అందజేస్తుండగా, ప్రస్తుతం వంటలు వండేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను అందజేశారు. దీంతో వంట నిర్వాహకులకు తంటాలు తప్పాయి.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా సరఫరా..

గతంలో అరకొరగా వున్న పాత్రలతో పాఠశాలలో వంట ఏజెన్సీలు వంటలు వండేందుకు నానావస్థలు పడేవారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఆధారంగా వంట పాత్రలను ఆయా పాఠశాలలకు మంజూరు చేసింది. నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వీటిని సరఫరా చేసింది. విద్యార్థుల సంఖ్యను ఆధారంగా పాఠశాలలను ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్ గ్రేడ్‌లుగా విభజించి ఈ మేరకు అవసరమైన పాత్రలను అందజేశారు.

గాలికొదిలేసిన గత ప్రభుత్వం

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పాఠశాలలో నడుస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేసింది. 2010 సంవత్సరంలో చివరిసారిగా మధ్యాహ్న భోజన పథకానికి వంటపాత్రలను అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆ తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకం అమలుతీరును పూర్తిగా పట్టించుకోలేదు. అరకొరగా వున్న పాత్రలతోనే నిర్వాహకులు వంటలు చేయాల్సి వచ్చేది. కొన్ని పాఠశాలలో పాత్రలేక ఏజెన్సీలే సొంత పాత్రలు తెచ్చుకునేవారు.

పాఠశాలల గ్రేడ్‌లు ఇలా

జగనన్న గోరుముద్ద పథకం అమలవుతున్న ప్రభుత్వ పాఠశాలలను అధికారులు ఆరు గ్రేడ్‌లుగా విభజించారు. 30 లోపు విద్యార్థులున్న పాఠశాలను ఏ-గ్రేడ్, 31 నుంచి 50 వరకు బీ-గ్రేడ్, 51 నుంచి 150 వరకు సీ-గ్రేడ్, 151 నుంచి 250 వరకు డీ-గ్రేడ్, 251 నుంచి 400 వరకు ఈ-గ్రేడ్, 400 అంతకంటే ఎక్కువ విద్యార్థులు ఉంటే ఎఫ్-గ్రేడ్‌లుగా విభజించారు. ఏ, బీ గ్రేడ్‌ల పాఠశాలలకు 5 వంటపాత్రలు, సీ,డీ,ఈ గ్రేడ్‌ల పాఠశాలలకు 6, ఎఫ్ గ్రేడ్ పాఠశాలకు 11 వంట పాత్రల చొప్పున పంపిణీ చేశారు. కోడుమూరు మండలంలో రూ.7 లక్షల వ్యయంతో 52 పాఠశాలలకు, సి.బెళగల్ మండలంలో రూ.5 లక్షల వ్యయంతో 40 పాఠశాలలకు, గూడూరు మండలంలో రూ.4 లక్షల వ్యయంతో 33 పాఠశాలలకు వంట పాత్రలను ప్రభుత్వం సరఫరా చేసింది.

నాణ్యమైన పాత్రల సరఫరా

మధ్యాహ్న భోజనం తయారీకి, వడ్డించేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు చాలా నాణ్యమైనవిగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న పాత్రలు చాలరోజుల కిందటి పాత్రలు. వాటిలో వంటలు వండేందుకు నిర్వాహకులు చాలా ఇబ్బందులు పడేవారు. కొన్ని పాఠశాలలో వంట పాత్రలు పూర్తిగా పాడవ్వడంతో పాటు, విద్యార్థుల సంఖ్య పెరిగింది. దీంతో ప్రభుత్వం విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ వంట పాత్రలను సరఫరా చేసింది.

– వసంతలక్ష్మి, మండల విద్యాధికారి, కోడుమూరు

వంట పాత్రలు సౌకర్యంగా ఉన్నాయి



గవర్నమెంటోళ్లు ఇచ్చిన వంట పాత్రలు సౌకర్యంగా ఉన్నాయి. పదమూడేళ్ల క్రితం ఇచ్చిన అరకొర వంట పాత్రలతోనే ఏళ్ల తరబడి వంటలు వండుతున్నాం. ప్రభుత్వం అందజేసిన పాత్రలతో వంటలు వండడం సులభతరంగా ఉంది. చేసిన వంటలు కూడా రుచికరం, ఎక్కువసేపు వేడిగా ఉంటున్నాయి.

– భాగ్యమ్మ, వంట ఏజెన్సీ మహిళ, పల్కుదొడ్డి

యోగాతో మానసిక ఆరోగ్యం

కర్నూలు(హాస్పిటల్): నిరంతరం ప్రతిరోజూ యోగా చేయడం వల్ల మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని, తద్వారా దీర్ఘకాలిక వ్యాధులు నియంత్రణలోకి వస్తాయని యోగా నిపుణులు సుధాకర్ గురూజీ చెప్పారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో యోగా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా తరగతులు సోమవారం నుంచి 10 రోజుల పాటు సాయంత్రం వేళల్లో ఇదే ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా అంటే కేవలం ఆసనాలు ఒక్కటే కాదని, ప్రాణాయామం, ధ్యానం కూడా యోగాలో భాగమేనన్నారు. దీనివల్ల ఆలోచనలు నియంత్రణలోకి వచ్చి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కారణంగా మనసు అదుపులో ఉండి ఆలోచనలు తగ్గుముఖం పట్టి దీర్ఘకాలిక వ్యాధులు నియంత్రణలోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, కార్డియాలజిస్టు డాక్టర్ పి. చంద్రశేఖర్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ, ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.